తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది.
ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

సమానత కోసం నినదించే సాక

జీవితాన్ని దాచకుండా దండోరా వేసినట్టు చెప్పడంలో కథా ప్రక్రియ చాలా ఉపయోగపడుతుంది. సుత్తి లేకుండా చెప్పడంలోనే కథకుడి నేర్పరితనం కనపడుతుంది. సాంపి జల్లి వాకిట్లో ముగ్గు వేసినంత అందంగా కథను అల్లడంలోనే కథకుడి నైపుణ్యం తెలిసిపోతుంది.

బతుకును, జీవితాన్ని ఏ ప్రమాణాలు కొలుస్తాయి? వస్తువు శిల్పం శైలి ప్రమాణాలకందని జీవితం ఉంటుంది. ఇది దళిత కథ. ఇందులో అలంకారాలు, విచిత్ర విన్యాసాలు, పద ప్రయోగాలు ఉండవు. బతుకును చిత్రించిన బాధలే ఉంటాయి. జీవితాన్ని మించిన కథ ఇంకేం ఉంటుంది? ఈ వార్షికలోని దళిత కథలు బతుకునే చిత్రించాయి. బాధలను ప్రతిబింబించాయి.

'జంబూ సాహితీ' నుంచి వెలువడుతున్న వార్షికలలో 'సాక' ముచ్చటగా మూడవది. 'సాక'కు అర్పించడం, అర్పణం, తర్పణం, ధారపోయడం లాంటి అర్థాలున్నాయి. దళిత కథను రికార్డు చేయడం, వాటిలోని మేలైన కథలను ఒక దగ్గరికి చేర్చడం జంబూ సాహితీ ఏటా చేస్తున్న ఆనవాయితీ. ఈ కథలు పత్లా కథలు కావు. గుండె లోతుల్లోని తేమను ఉసిలించే కథలు. నిద్రాణమై ఉన్న మనిషి చర్రున సరుపు సరిచి లేపే చైతన్యపూరితమైన కథలు. ఇందులో భిన్నమైన కథా వస్తువులున్నాయి. ఇప్పుడు కథల గురించి కొత్తగా మాట్లాడుకోవాలి. సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే రచయిత జీవితాన్ని అర్థం చేసుకోవాలి. సెయింట్ బోవే (1804–1869) చెప్పినట్టు 'దళిత కథ' అర్థం చేసుకోవాలంటే దళితులు అనేక వేదనల మధ్య, జీవితాలను కోల్పోయిన దుస్థితుల మధ్య నలుగుతున్న స్థితిని కొత్తగా సరికొత్తగా మాట్లాడుకోవాలి.

> నిజానికి దళితులకు తమకేం కావాలో స్పష్టంగా తెలిసినా వస్తువు 'ఎంపిక' సమస్య ఒకటి ఎప్పుడూ ఉండనే ఉన్నది. ఎన్నో బాధలు. ఏ బాధలు ముందుగా అక్షరీకరించాలో కొద్దిగా సందిగ్ధత ఉంటుంది. అయినప్పటికీ అన్ని బాధలు, కథలు కాలేవు. అందరూ బలంగా మాటల్లో రాజ్యాధికార కాంక్షను 'వ్యక్తం' చేస్తున్నారు కానీ, ఉన్నతవర్గాల వారి 'మనీ క్రేడ'ను తట్టుకోలేకపోతున్నారు. అంతర్గతంగా కుల ప్రస్తావనలు ఎలా తికమక పెడుతున్నాయో? జీవితాంతం ఎలా బాధిస్తున్నాయో? ఎలా భయపెడుతున్నాయో అనుబంధాలను తెంచేయటాన్ని దళిత నిప్పుల తప్పటై మోగుతున్నాయి.

తండ్రీ కూతురు ఒక్కటై తల్లిని వేధించడానికి ఏది కారణమై ఉంటుందో తల్లి జీవితాన్ని వెంటాడుతున్న సమస్య ఏమిటో తెలుసుకోవాలంటే సతీష్ చందర్ 'యువరానర్' కథ చదివితే జీవితమంతా బాధించిన విషయం అవగతమవుతుంది. కుల వివక్ష ప్రతినిధి అయి పీడించిన వ్యక్తిని అంతిమ సంస్కారంలో అయినవాళ్లు, ప్రోత్సహించిన వాళ్లు ఎవరు రాలేదు. మహోన్నత మనసుతో పురుగులు పడ్డ శవాన్ని దళితులు ఎలా మోశారో తెలియజేసే జూపాక సుభద్ర కథ 'అప్పు పడ్డది సుమీ' చదువాల్సిందే. కులం గొప్పదైతే గొప్ప కాదు. గుణం గొప్పగా ఉండాలని, ఆ గొప్ప గుణం దళితులకు ఉన్నదని ఎలా రూపం చేసిందో జిలుకర శ్రీనివాసు రాసిన 'బురద గుంట' కథ అధ్యయనం చేస్తే కానీ అర్థం కాదు.

బతుకు పోరులో ఓడి గెలిచిన సైనికుల గొప్పతనం, బతుకంతా సాము చేసి నిలిచి గెలిచిన సుందరమ్మ స్ఫూర్తి ఏమిటో అర్థం కావాలంటే చల్లపల్లి స్వరూపారాణి రాసిన 'సాము' కథ ఆవాహన చేసుకోవాల్సిందే. దళితులు పెనవేసుకున్న క్రైస్తవ్యం, పోరాటం నేర్పిన కమ్యూనిజం, అస్తిత్వమే అంతిమ కలికితురాయని ప్రకటించిన అంబేద్కరిజం, వీటి మధ్యలో డోలాయమానమైన స్థితి నుంచి ఒక నిశ్చిత ఆలోచన తెలియాలంటే పసునూరి రవీందర్ కథ 'ఒక నేల మూడు ముఖాలు' త్రికరణశుద్ధిగా పఠించాల్సిందే. జీవితాన్ని ఎలా జీవించవచ్చో నేర్పుతుంది మంచి దళిత కథ. తెలుగు కథ ఇంకా అంటరానితనం దాటలేకపోయిందనడాన అపవాదు ఒకటి ఉండటానికి కారణం కులమే. 'ముక్కు ఉన్నంతసేపు పడిశం ఉంటుంది' అన్నట్టుగా కులవివక్ష ఉన్నన్ని రోజులు దళితులకు వివక్ష అటరానితనం తప్పేటట్టు లేదు. ఈ విషయాన్ని చాలా కథలు తెలియజేస్తున్నాయి.

స్వీయ అస్తిత్వ పరిరక్షణ కోసం వైరుధ్యాల తగ్గింపు కోసం కృషిజరగాలి. మనుషులు ఎందుకు ఇంకా మారడం లేదు, ముఖ్యంగా చదువుకున్న మనిషి ఎందుకు ఇంతలా కులచట్రంలో కుంచించుకుపోతున్నాడు? అనే ప్రశ్నలకు ఈ కథలు కొంత సమాధానాన్ని ఇవ్వగలవు. లోపలి బాధను తోడిపోసిన చరణ్ పరిమి కథ 'అతిథితో అక్కడిదాకా!' గుండెను పిండేస్తుంది. హావింగ్ లైఫ్, హవ్ నాట్ లైఫ్‌కు మధ్య ఏదో కనెక్షన్ తెగిపోయినట్టు ఈ కథ మనకు తెలుపుతుంది. క్రైస్తవం హైందవీకరించబడిందా? హిందువులు క్రైస్తవీకరించబడుతున్నారా? అనే మీమాంసను క్లియర్ జేసే వాస్తవిక కథ మెర్సీ మార్గరెట్ రాసిన 'వర్షం సాక్షిగా'.. తెలియాల్సిందే. ఒకే ఊరి నుంచి అగ్ర కుల పటేలు రామారావు, మాదిగ కులానికి చెందిన రాములు ఇద్దరు పట్నం వలస వచ్చి, పట్నం వచ్చినంక కూడా కుల వివక్షను, ఆధిపత్యాన్ని వదులుకోలేని తనాన్ని పటేల్ అహంకారాన్ని పట్టించే కథ తాళ్లపల్లి యాకమ్మ రాసిన 'వెన్నెల గొడుగు' కథ. అదేవిధంగా అగ్ర కులాలకు దళితులు ఎలా బలై పోతున్నారో తెలియజేసే కథ కెంగార మోహన్ రాసిన 'సమిధలు' కథ.

చదువుకొని ఉద్యోగం వచ్చిన తర్వాత, చాలామంది దళితులు తమ మూలాలను మరిచిపోతున్నారు. సోఫిస్టికేటెడ్ లైఫ్‌కు అలవాటుపడిన తర్వాత తాను నడిసొచ్చిన, ప్రయాణాన్ని, మార్గాన్ని తామే అమమానిస్తుంటారు కొందరు దళితులు. 'ఎంత దూరం వెళ్లినా మేము మాకులాగానే ఉంటాం' అంటూ మూలాలను తెలియజేసే కథ అనిల్ డానీ 'వీకెండ్'.

గర్భిణీ చనిపోతే బొందలగడ్డలో పూడ్చిపెట్టనీయకుండా అవమానించి, అడ్డుకొని, కడకు బొందల గడ్డలో కూడా స్త్రీ వివక్ష ఎదుర్కొంటున్నదని తెలియజేసే కథ డీజీ హైమవతి రాసిన 'బొందల గడ్డకు దూరంగా' అనే కథ. ఇవేకాకుండా పెనుమాక రత్నాకర్, సోలోమోన్ విజయ్, సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్ రాసిన కథలు కూడా ఆలోచింపజేస్తున్నాయి. అసూయ అనేది దోపిడీ కులాలు, దోపిడీకి గురయ్యే కులాల్లోనే కాదు, కింది కులాల్లో కూడా అంతర్గతంగా ఉంది. ఆ అసూయ పెరిగిపోతుంది. ఇది తగ్గించాలంటే ఇంకా ఉత్తమ కథలు రావాలి.

ఆధిపత్య వర్గాలు ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచించాలి. అంబేద్కర్ మార్గాన్ని ఆచరించాలని ఈ కథల్లో అంతర్గతంగా ఒక ఆలోచన ఉన్నది. ఈ కథల్లో సాంస్కృతిక వ్యత్యాసం, కులమతాల ఆర్థిక వ్యత్యాసం, ఆధిపత్యాలు మొదలైన వస్తువులతో కథలు నడిచాయి. దళిత జీవితం అధునాతనమైన వ్యవస్థలోకి ఈ కథల్లో సాంస్కృతిక వ్యత్యాసం, కులమతాల ఆర్థిక వ్యత్యాసం, ఆధిపత్యాలు మొదలైన వస్తువులతో కథలు నడిచాయి. దళిత జీవితం అధునాతనమైన వ్యవస్థలోకి చేరుకోవాలని కోరుతున్నాయి ఈ కథలు. జీవితానికి సంబంధించిన సున్నితమైన సమస్యలను సెన్సిటివ్‌గా వ్యక్తీకరించిన కథలు ఇవి.

> జంబూ సాహితీ ప్రచురించిన రెండు కథా వార్షికలను ఆదరించినట్టుగానే ఈ మూడవ 2022వ కథా వార్షికను కూడా ఆదరించి తగు సూచనలు, సలహాలు ఇవ్వవలసిందిగా సాహితీ పాఠకులను కోరుతున్నాం. కథలను ఎంపిక చేయడంలో మాకు కష్టమైనప్పటికీ ఇష్టంగా చేస్తున్న పనిగా భావిస్తూ అందరికీ జై భీమ్.
>
> *- డాక్టర్ సిద్ధెంకి యాదగిరి*
> *- గుడిపల్లి నిరంజన్*
> *- తప్పెట ఓదయ్య*

పోరాట మహాకావ్యం కుందుర్తి 'తెలంగాణ'

తెలంగాణలో 1946లో ఉవ్వెత్తున లేచిన దోపిడీ వ్యతిరేక ఉద్యమజ్వాల ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ ఉద్యమానికి కమ్యూనిస్టులు అండగా నిలిచారు. ఈ ఉద్యమానికి 'తెలంగాణా రైతాంగ పోరాటం' అనే పేరూ ఉంది. ఈ తెలంగాణ పోరాటంలోని వ్యథార్థత గాథలను ఆంధ్రాప్రాంతంలోని కవులు ఎందరో కవిత్వంగా మలిచారు. వాటిలో కవి ఆవంత్స సోమసుందర్ 'వజ్రాయుధం' (1949), కవి ఆరుద్ర 'త్వమేవాహమ్' (1949) మొదలైనవి ఉన్నాయి. ప్రాంతేతరులైన ఈ కవులు ఆనాటి తెలంగాణ ప్రజల బాధలనూ, కన్నీళ్లనూ, పోరాట పటిమను చూసి స్పందించి, తమ కవిత్వంలో పలవరించారు. వచన కవితోద్యమ నాయకుడిగా వచన కవితా ప్రచారకుడిగా, తెలుగు వాల్ట్ విట్మన్‌గా అభ్యుదయ కవితకు, వచన కవితకు పర్యాయపదంగా నిలిచిన కవిగా పేరుపొందిన కుందుర్తి ఆంజనేయులును కూడా ఈ తెలంగాణ పోరాటం (1946–51) కదిలించింది. వచన కవితా ప్రక్రియలో తొలిసారిగా 'తెలంగాణ' పోరాట కథను మహాకావ్యంగా రాయడానికి ఆయన పూనుకున్నారు.

ప్రముఖ కవులు కవికోకిల గుర్రం జాషువా, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణల శిష్యుడైన కుందుర్తి పద్యాన్నీ అతి సున్నితంగానూ ప్రౌఢంగానూ రాయగలిగేవారు. తాను రాసే కవిత్వం సామాన్య ప్రజలకు చేరాలని ఏ ఛందోబంధాలు లేని స్వేచ్ఛామార్గమైన వచన కవితా ప్రక్రియనే తన వాహికగా ఎంచుకున్నారు. 1941 నుంచి 1982లో చనిపోయే వరకూ వచన కవితాభివృద్ధికే అంకితమయ్యారు. 'రచన పూలతోటలో/ ఛందస్సు మొక్కలు నాటను / భావనలో సామాన్యుని/ జీవిత వలయాలు దాటను' అని శపథం చేశారు. 'పాతకాలం పద్యమైతే/ వర్తమానం వచన గేయం' అంటూ ఆధునిక కవిత్వానికి లక్షణకారుడిగా లక్షణం చెప్పారు.

'తెలుగులో వచన కవితను ఓ మలుపు తిప్పిన మహాకవి కుందుర్తి. సంప్రదాయాన్ని బాగా జీర్ణించుకొని ప్రయోగశీలతను అలవరచుకున్న పురోగామి కవి ఆయన. అందువల్లనే ఛందస్సు నుంచీ, గ్రాంథిక పదబంధాల నుంచీ విడిపోయారు.. కవిత్వ భాషను మాట్లాడుకునే భాషకు దగ్గరగా తీసుకువచ్చాడు' అంటూ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, అభ్యుదయ కవి సి.నారాయణరెడ్డి అన్న మాటలు అక్షర సత్యాలు. ఆకాశంలో విహరించే కవిత్వాన్ని భూమార్గం పట్టిస్తానన్న శ్రీశ్రీ మాటలను నిజం చేసిన కవి కుందుర్తి.

సోమసుందర్, ఆరుద్రల లాగే 1949లోనే కవి కుందుర్తి 'తెలంగాణ' పేరిట తెలంగాణ పోరాట కథను మహా భారతంలో 18 పర్వాలుండగా 18 భాగాలుగా వచన కవితలో బృహత్కావ్య రచనకు పూనుకున్నారు. 1953లో ఈ కావ్యాన్ని పూర్తిచేశారు. ఆంధ్రుల తొలి రాజధాని కర్నూలులో 1956లో ప్రభుత్వ సమాచార శాఖలో ఉద్యోగంలో చేరి, ఆ సంవత్సరం డిసెంబర్ నెలలో 'తెలంగాణ' వచన మహాకావ్యాన్ని ప్రకటించారు.

> ఆసియాలోనే పెద్ద ఉద్యమాల్లో ఒకటిగా పేరు తెచ్చుకున్న తెలంగాణ పోరాటంపై కుందుర్తి వచన కవితలో మహాకావ్యం రాస్తూ.. మహా భారతం పోలికతో ఇందులో – 'ప్రస్తావన', 'రాయమూర్', 'బహిష్కార', 'అజ్ఞాత', 'మానభంగ', 'గృహదహన', 'ప్రతిఘటన', 'దిగ్విజయ', 'భూమిదాన', 'న్యాయదాన', 'రజాకార', 'దురాగత', 'దండయాత్ర', 'ఉపసంహారం' అంటూ 18 భాగాలుగా విభజించి రాశారు.

'కాలాన్ని కొలిచేందుకు గడియారాలెందుకు? / క్యాలెండర్లు, పంచాంగాలూ, కేవలం వృథా కదా/ ఆ కాలప్రజ చదివిన కష్టకావ్య సంపుటాలు/ సామాన్యుల బాధలు, జీవితాల గాథలు చాలు' (ప్రస్తావనం) అంటారు. 'పర రాజులు నిలదొక్కుకునేందుకు బలంగా/ చేసిన సహకారానికి ఒక జానెడు నేల ప్రతిఫలంగా/ గడించిన సింహాసనమది' అంటూ నైజాం ప్రభుత్వం సింహాసనం గురించి యథార్థం చెప్తారు.

'స్వార్థం కట్టిన గులకరాళ్లే / వంతెనే ఆలంబనగా/ సామాన్యుల బతుకు/ బాటకొక లంబంగా/ ప్రగాఢ కాంక్షలతో / ప్రతి నిమిషం బతుకు మీద ఆంక్షలతో / పరిపాలన సాగింది' అంటూ ఆనాటి పాలన గురించి వివరిస్తారు. నైజాం సంస్థానమైన తెలంగాణ ప్రాంతంలో జమీందారుల, దేశ్‌ముఖుల దురాగతాలతో ప్రభువుపైనా, ఆనాటి పాలకుపైనా కోపాగ్ని జ్వాలలతో ప్రజలు చైతన్యవంతులైనారనీ, 'ఈ మూడు శతాబ్దాలు మీటిన పరిపాలన వీణల/ పలికినై అపశబ్దాల పరంపరల బాణులు/ క్రమక్రమాగత చైతన్య ధనుష్పాణులు/ ప్రజలు నేడు' అంటూ కుందుర్తి నైజాం సంస్థానంలో మారిన ప్రజల తీరును వర్ణించారు. 'ప్రసవించి నశిస్తుంది గెల వేసిన అరటి తరువు/ ప్రగతి శిశువు జననంతో అధర్మానికిక కరువు/ పుడమితల్లికిటీవలనే మలి చూలు నెల తప్పింది' అంటూ కుందుర్తి తెలంగాణ పోరాటానికి బీజావాపమైందని చెప్తారు. ప్రతి పల్లె హృదయంలోనూ ఒక దాక్కున్న ఉదయం ఉందంటూ, ప్రతి పల్లె రహస్య జీవితంలో ఇప్పుడు రాత్రి పాఠశాల ఉందంటూ, తిరణాలలో మారుపడిన కుర్రాడు తెలుసుకున్న దారి 'సంఘం' అంటారు. 'సంఘం సూర్యుడు చాచిన/ శతసహస్ర కిరణాల దీర్ఘ బాహువులు/ పోలీసు ఠాణాన్ని/ దేశముఖుల దివాణాల్ని వాటేసుకున్నై' అంటూ సంఘ కార్యకలాపాలు ప్రజోద్యమంగా ఎట్లా విస్తరిస్తాయో కుందుర్తి వర్ణించారు.



> తెలంగాణ పోరాటంలో ప్రాణం కోల్పోయిన తొలివీరుడు దొడ్డి కొమురయ్య పేరును ప్రస్తావిస్తూ... 'ఆ పైన ఎంతమంది అమరయ్యలు, అమాయకులు కరిగారో' అని కుందుర్తి బాధను వ్యక్తం చేశారు 'గుడిసె ముందు అధికారి యువతిని చెరిచాడు/ ఎవరూ అక్కడ ఉండకూడదని అరిచాడు/ పదహారేండ్ల మానవతి శీలాన్ని కరిచాడు/ ఆ అమ్మాయి అవమానంతో గుడిసెలోకి పోయింది/ ఆ అమ్మాయి ఉదయం ఆరు గంటలకు చచ్చిపోయింది' అని ఒక దుర్ఘటనను ఆనాటి పాలకుల ఆగడాలకు ఉదాహరణగా చెప్పారు.

'వారం రోజుల ముందు వట్టి పిరికి గుండె/ నేడు ముప్పేట మలచిన దారపు కండె / ప్రాణం పెళ్లాలకు దాసులైన ఒకరిద్దరు పోను/ మిగిలినవారు జితేంద్రియలు' అని తెలంగాణ పోరాటం చేయడానికి నడుం కట్టిన యువ వీరులను ప్రశంసించారు. ఊరి వెలుపల పెదకాపు తోపులో విరగ్గాసిన కొడపళ్ల చింతలు ప్రజలు కోసుకోవచ్చు' అని ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పునూ తెలియజేశారు. 'మతానికి నవాబు పెట్టిన ముద్దు పేరు/ ఆనాటి రజాకారు' అంటూ వీళ్లే గ్రామాలను కుంపటిలా మండించారనీ పాపాన్ని పండించారనీ అంటారు. 'రజాకార్లు కట్టుచీరలు ఊడబీకారు/ ఆనాటి (సంఘ) ప్రతిఘటన/ రథచక్రాలు కూరుకుపోయిన/ కర్ణుని అస్త్రవిద్యలా / సమయానికి చాల్లేదు' అని హృదయ విదారక సంఘటనను కుందుర్తి ఇందులో చెప్పారు.

'పోలీసు చర్యకూ యుద్ధానికీ అదో రకం తేడా ఉంది/ ఒకటి మన బాహుదర్ప ప్రదర్శనం/ రెండోది పశుత్వ ప్రదర్శనం' అంటూ పోలీసు చర్యను (1948) కుందుర్తి సమర్థించడం గమనార్హం. పోలీసు చర్య తర్వాత 'అడివంతా అల్లకల్లోలం చేసిన / మత్తగజం లొంగింది / ఒక జాతి ప్రతిస్పావాహిని / గట్లు త్రెంచుకు పొంగింది/ నవాబు తల నేలకు వంగింది' అంటూ ఇందులో కుందుర్తి నిజాం ఏ విధంగా లొంగిపోయాడో వర్ణించారు. 'భారీ స్వయంవరంలో కాలంకాంత నిజాన్నే వరిస్తుంది.. ఉల్లాసాల విరజాజుల పూలమాల బతుకు కంఠంలో ధరిస్తుంది అని, జీవితం భయాన్ని ధిక్కరిస్తుందనీ, బాధలను అధఃకరిస్తుంది అని తెలంగాణ పోరాటం సాధించిన విజయాన్ని వివరిస్తారు.

> 'బహుశా ఇదే మొదలనుకుంటాను/ గేయాలు తెచ్చిన కొత్త తెలుగు/ ఆధునిక యుగంలో ఒక పూర్ణకావ్యంగా / బతుకును వర్ణించడం' అని కుందుర్తి తన ఈ 'తెలంగాణ వచన కవితా కథాకావ్య విశిష్టతను చెప్తూ 'ఈ నేల ఎవరిది? కోటి ప్రజల సొత్తు కదా/ కొందరు వద్దంటే ఒప్పుకొని చరిత్రా!/ ముందుకు పదా!' అంటూ కవి కుందుర్తి తెలంగాణ కావ్యాన్ని ముగించారు.

ప్రజల నోళ్లలో నానే పలుకులతో, పదబంధాలతో సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా సామాన్యుడి భాషలో కుందుర్తి ఈ కావ్యాన్ని రాశారు. అయితే 'అధర్మం తుంచేసి ధర్మ ప్రతిష్ఠాపన' కోసం ఈ కవి కుందుర్తి చెప్పడం ఈ కావ్యంలో పెద్దలోపం అని ఒక విమర్శ ఉంది. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమంటే.. కుందుర్తి వీరసామ్యవాది కారు. రాజకీయ సిద్ధాంత భేదాలతో నిమిత్తం లేకుండా ప్రజల అభిప్రాయానికి విలువ ఇచ్చే తత్వం ఆయనది. నిరంకుశ పాలన అంతరించాలని ప్రజలు కోరుకున్నారు. గనుక ఆ నిజాం నవాబును లొంగదీసింది పోలీసు చర్య గనుక, ప్రజలందరికీ మేలు చేసేదే గనుక కుందుర్తి పోలీసు చర్యను ధర్మ ప్రతిష్ఠాపన కోసం అని అన్నారు. ఏదేమైనా– తెలంగాణ పోరాట కథను అవగాహనతో చిత్రించిన తొలి వచన కవితా మహాకావ్యం కుందుర్తి 'తెలంగాణ' ఒక్కటే అని చెప్పవచ్చు.

'రఘువర్మ', టీ. లక్ష్మీనారాయణ
92900 93933

(వ్యాసకర్త: కుందుర్తి సమగ్ర సాహిత్యంపై డాక్టరేట్ పొందిన పరిశోధకుడు)

ఆస్తిపరుడు ఆస్తిలేనోడని

విభజించి చూస్తున్నట్టు
రక్తాన్ని కూడా విభజించాలి
దబ్బు లున్నోడిది ఏ రక్తమో
దబ్బు లేనోడిది ఏరక్తమో రంగులను గుర్తించాలి

కులాన్ని బట్టి వేరుశనగ పండుతుందనుకుంటే
భూమిలో మొలకెత్తినప్పడే కులం పేరు రాసుండాలి
దావఖానలో పుట్టినోడికి దేవుడి ఆశీస్సులు అనుకుంటే
కాన్పు చేస్తున్న వైద్యులే దేవుళ్లు అనుకోవాలి

కన్యాదానానికి ఆస్తిపాస్తులు చూస్తుంటే
కాటికి వెంట తీసుకెళ్తున్న సంపదలెన్నో చూపాలి
ధనవంతుడు ధనవంతుడి చుట్టే తిరుగుతుంటే
హింసకు గురైన బాధితుల లెక్కలు చెప్పాలి

పెళ్లికి అణగారిన కులమైనప్పడు
అత్యాచారానికి బలైపోతున్న కులమేదో గుర్తించాలి
చంద్రునిపై పరిశోధనలు జరుపుతున్నట్టు
మానవీయతపై పరిశోధనలు జరగాలి

ఆకారమొక్కటే కాదు అవయవాలు కూడా లెక్కించాలి
కులాన్ని బట్టి పయే అవయవాలేవో గుర్తించాలి
చేతులెత్తి మొక్కడానికి వచ్చిన చోట కులాన్ని సూచించిన
విష్ణు ఈశ్వర బ్రహ్మల రహస్యం పమిటో తెలియాలి

ఎజ్జు మల్లయ్య
96528 71915

'సముద్రం' అంశంపై కథల పోటీ

విశాలాక్షి సాహిత్య మాసపత్రిక శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారకంగా 'సముద్రం' అంశంపై కథల పోటీ నిర్వహించి ఎంపికైన కథలతో ప్రత్యేక కథా సంపుటి తేవాలనుకుంటున్నది. ప్రథమ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి ఐదు కథలకు ఒక్కోదానికి రూ.3 వేలు, తృతీయ బహుమతి ఐదు కథలకు రూ.2 వేల చొప్పున ప్రదానం చేస్తారు. సాధారణ ప్రచురణకు ఎంపికైన ప్రతి కథకు వెయ్యి రూపాయలు బహుమతి ఉంటుంది. 2024, జనవరి 20 లోపు.. విశాలాక్షి సాహిత్య మాసపత్రిక, 27-5-487 పద్మావతినగర్, బాలాజీనగర్ ఎక్స్‌టెన్షన్, నెల్లూరు-524002కు పంపాలి.

- ఈతకోట సుబ్బా రావు, 94405 29785

గ్రంథావిష్కరణ సభ

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా.. 2023 డిసెంబర్ 29 శుక్రవారం రోజున సాయంత్రం 6 గంటలకు కేంద్ర సాహిత్య అకాడమీ, తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'అవధేశ్వరి', 'ఆకాశం నా వశం', 'తాకట్టులో రఘునాథ్', 'బియాండ్ ది షోర్స్ ఆఫ్ రివర్స్ ఆఫ్ ఎగ్జిస్టెన్షియలిజం', 'మల్లాది రామకృష్ణశాస్త్రి' గ్రంథాల ఆవిష్కరణ సభ జరుగనున్నది. స్వాగతోపన్యాసం సి.మృణాళిని చేయనుండగా ముఖ్య అతిథిగా పి.ఎస్.గోపాలకృష్ణ, గౌరవ అతిథిగా మామిడి హరికృష్ణ పాల్గొననున్నారు. వక్తలుగా నందిని సిధారెడ్డి, ఖదీర్ బాబు, అనంత్ చింతలపల్లి, ప్రసేన్, స్వర్ణకిలారి హాజరుకానున్నారు. నాళేశ్వరం శంకరం వందన సమర్పణ చేయనున్నారు. అందరూ ఆహ్వానితులే.

'బాపు' పుస్తకావిష్కరణ

కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని మీనాక్షి ఏసీ కన్వెన్షన్ హాల్‌లో 2023, డిసెంబర్ 30 శనివారం రోజున జర్నలిస్టు గడ్డం సతీష్ రాసిన 'బాపు' పుస్తకావిష్కరణ జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ హాజరవుతారు. వక్తలుగా తెలంగాణ ఈఆర్‌సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు, నమస్తే తెలంగాణ సంపాదకులు తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ టుడే సంపాదకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీవీ మాజీ కమిషనర్ కట్టా శేఖర్‌రెడ్డి, పరాంకుశం వేణుగోపాలస్వామి, ఎన్జీవీ శ్రీనివాసరావు, తుమ్మలపల్లి రఘురాములు, ఓరుగంటి సతీష్, రచయితలు అల్లం రాజయ్య, పెద్దింటి అశోక్‌కుమార్, నారదాసు లక్ష్మణ్‌రావు, ఇట్యాల వెంకటకిషన్ తదితరులు పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే.

- గడ్డం సతీష్, 99590 59041

ప్రకటనలు

చౌరస్తా

మానవ జీవితంలో
మూడు ముక్కలాట
గెలవడం
ఓడడం
పోరాడడం

ఇతరుల హృదయాలను
గెలుచుకోవడం
చెడును వదిలిపెట్టడం
కలిసి నలుగురితో నడవడం

పురోగమనం
తిరోగమనం
అనురాగ గమనం
ఇవి మూడే
జీవన ప్రయాణంలో...

జ్ఞాన పరిజ్ఞానం
సంపాదించుకున్న
అభిమాన సంపాదన
తోడు నీడగ ఉంటే
అంతా ఆనందమే

రేడియం
92915 27757

నేను!

నేను కురిశాను
నేను తడిపాను
నేను పెంచాను
నాకంతా ఋణగ్రస్తులు!

నేను పూచాను
నేను వీచాను
నేను నిలిచాను
నాకంతా ఋణగ్రస్తులు!

నిండు గర్భిణులు
కనక మానేనా
ఎండవేడికి నిండుమబ్బులు
కరగక ఆగేనా!

ప్రాయాన ప్రాణులు
వికసించక ఆగేనా
ఒంపులో సొంపులో
ఆపితే ఆగేనా!

ఆగలేక జారి కురుయు చినుకుకు
పుడమి ఋణగ్రస్తుమా
పడుతున్న చినుకులను ఒడిసిపట్టు
అవనికి చినుకు ఋణగ్రస్తుమా!

మబ్బును కరిగించిన వేడికి
భూమి ఋణగ్రస్తుమా
తాపము తగ్గించిన చినుకుకు
ధరణి ఋణగ్రస్తుమా!

ప్రాణం నిలిపే పవనమునకు
విశ్వంభర ఋణగ్రస్తుమా
ఆశ్రయమిచ్చిన వసుంధరకి
గాలి ఋణగ్రస్తుమా!

పంచభూతాలకంటని
ఋణ గణాంకాలు
తుచ్ఛ ప్రాణులెందుకో
అంతటి అహంకారమెందుకో!

నేను నేను నేను నేను
నా కిందే అంతా
నే లేకుంటే వాడెంత
నేను నేను నేను నేనని!

రవికిషోర్ పెంట్రాల,
లాంగ్లీ, లండన్!